మరమరాల పందిరిలో..
రాములోరి కల్యాణం

ఏపీఏయూ కాలనీలో ధర్మనిలయం



● 39 ఏళ్లుగా ధర్మనిలయంలో ఉత్సవాలు

సైదాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్, ఏపీఏయూ కాలనీలోని ధర్మనిలయంలో మరమరాలు.. వేరుసెనగలతో తీర్చిదిద్దిన పందిరిలో 39 సంవత్సరాలుగా సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు ఉగాది రోజున ప్రారంభమై నవమి రోజు కల్యాణంతో ముగుస్తాయి. రామాయణ ఇతిహాసం తెలియజేసే విధంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఉత్సవాల్లో జరిగే నిత్యాన్నదానంలో వేలాదిమంది భక్తులు పాల్గొంటారు.



కొలువుదీరిన సీతారాములు

కొనసాగుతున్న ఆచారం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీప గ్రామం నుంచి వచ్చిన సూర్యనారాయణరాజు కుటుంబం తమ ఇంట్లోనే ధర్మనిలయం పేరిట రామాలయాన్ని ఏర్పాటు చేశారు. 39 ఏళ్లుగా ఆలయంలో మరమరాలతో పందిరి వేసి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం సూర్యనారాయణ రాజు మృతి చెందగా ఆయన సతీమణి కుటుంబసభ్యులతో కలిసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా రామకోటి జపం, విష్ణుసహస్ర నామాలు, నగర సంకీర్తన, భజనలు, హోమాలు, నిత్యాన్నదానం ఉంటాయి.



పందిరిలో మరమరాల దండలు

రెండు బస్తాల మరమరాలు, వేరుశెనగలు..

మాఘ శుద్ధ పంచమి రోజున గ్రామదేవతకు చలిమిడి, పాలతో అభిషేకించి పందిరి పనులకు శ్రీకారం చుడతారు. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున ప్రారంభిస్తారు. సుమారు 40 మంది మహిళలు రోజూ దారాలకు మరమరాలు ఎక్కిస్తారు. 60 కిలోల మరమరాలు, 40 కిలోల వేరుశెనగలను అలంకరణకు వినియోగిస్తారు. రామనామ జపం చేస్తూ మహిళలు ఆధ్యాత్మిక వాతావరణంలో అల్లికలను సాగిస్తారు.

మరా.. మరా.. రామ...

రామ జపానికి మూలం మర అనే భావనతో సీతారాముల కల్యాణానికి మరమరాలు ఏర్పాటుచేశారు. పదకొండు మరమరాల చొప్పున తయారు చేసే దండలో ఓ పల్లీగింజ (వేరుశెనగ) చేరుస్తారు. సీతాదేవి భూగర్భంలో అవతరించిందనే పౌరాణిక గాథను అనుసరించి భూమి నుంచి వచ్చే వేరుశెనగకు మరమరాల దండల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దశేంద్రియాల తర్వాత ఏకాదవ ఇంద్రియానికి ప్రత్యేక స్థానం కల్పించే ఉద్దేశంతోనే పదకొండు సంఖ్యను ఎన్నుకున్నారు.



రామాయణం ఇతిహాసం తెలియజేసే బొమ్మలకొలువు

రాముడి ఆదేశంతోనే సేవ..



చిన్నప్పటి నుంచి రాముడి భక్తురాలిని. రాముడి ఆదేశంతో మేమంతా 39 ఏళ్లుగా మరమరాల పందిరిలో నిరాటంకంగా శ్రీరామ కల్యాణం జరిపిస్తున్నాం. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున మొదలు పెడతాం. 40 మంది భక్తులు మరమరాల హారాలు అల్లుతారు. ఇద్దరు కుమారులు, కోడళ్ల సహకారంతో యజ్ఞం నిరాటంకంగా కొనసాగిస్తున్నా. నా తదనంతరం కుటుంబసభ్యులు సంప్రదాయాన్ని కొనసాగిస్తారని నమ్ముతున్నా

-నిర్వాహకురాలు అనసూయమ్మ



వనస్థలిహిల్స్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలి : సామ రంగారెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): మల్కాజిగిరి బీజేపీ ఎంపీగా తెలంగాణ ఉద్యమకారుడైన ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి కోరారు. వనస్థలిపురం డివిజన్ హిల్‌కాలనీలోని బూత్ నం.300లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దశాబ్ద కాలంలో దేశాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్దం రామ్‌రెడ్డి, సామ మహేందర్ రెడ్డి, రాజ్ కుమార్, వెంకట్ రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి రజిని రెడ్డి

మన్సూరాబాద్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం

వనస్థలిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ ప్రియమైన మోదీ కాదని, పిరమైన మోదీ అని మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజిని రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ మహిళల ఆత్మీయ సమావేశం సోమవారం మన్సూరాబాద్‌లోని ఎంఈఈ రెడ్డి గార్డెన్స్‌లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ కమలా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలంతా కలిసికట్టుగా పనిచేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమలా సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకులు, పలు డివిజన్ల మహిళా అధ్యక్షులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి సతీమణి సీతారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచి తన భర్తను అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారాన్ని సోమవారం సీతారెడ్డి ప్రారంభించారు. బడంగ్‌పేట్ పాత గ్రామంతో పాటు పలు కాలనీల్లోనూ పర్యటించి ఓటర్లను కలిసి, హస్తం గుర్తుపై ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమృతానాయుడు, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరీ జైహింద్ కుమార్, సరూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు బంగారు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్టు బాలకృష్ణ, బోయపల్లి వెంకట్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చప్పిడి సంతోష్ రెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, పి.రవికాంత్‌రెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పూర్తిచేయాలి

చంపాపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మారుతీనగర్‌కాలనీలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరదనీటి కాలువ) నిర్మాణ పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతీనగర్‌కాలనీలో వర్షాలు కురిసినపుడు నీరు ఇళ్లలోకి చేరుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకోసం స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు కాలనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన అమ్ముతున్న విగ్రహాలు

కల్యాణం కోసం మట్టి విగ్రహాల విక్రయం

ఓల్డ్‌మలక్‌పేట, 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం కోసం అవసరమైన రంగురంగుల మట్టి విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌ల మీద సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు విక్రయిస్తున్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడి అరెస్టు

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నాగోల్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ పరశురామ కథనం ప్రకారం.. నాగోల్ పీఎస్ పరిధిలో ఉండే బాలికను అదే ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి నల్ల రాజేష్(29) మాయమాటలు చెప్పి దగ్గరయ్యాడు. పలుమార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఈనెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఇక బీఆర్ఎస్ కథ కంచికే!

ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ కథ ఇక ముగిసినట్లేనని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మన్నెగూడలోని బీఎంఆర్‌సార్థ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్ కుటుంబానికి ప్రజలు తగిన శాస్తి చేశారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని నాలుగు లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీకి రెండు వందల సీట్లు కూడా రావడం కష్టమేనని అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్‌గౌడ్, జడ్పీటీసీ మహిపాల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంగమ్మ శివకుమార్, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, లక్ష్మీపతిగౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఆలయాల నిర్మాణం చేపట్టాలి

● మాజీ మంత్రి పి.సబితారెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి సబితారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఆలయాల నిర్మాణం చేపట్టాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ బ్రాహ్మణ జాతి అండ

విశాఖ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర



మల్కాజిగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాల ప్రజలనూ అక్కున చేర్చుకునేది బ్రాహ్మణ జాతేనని విశాఖ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర అన్నారు. విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామితో కలిసి తెలంగాణ ఆలయాల సందర్శనలో భాగంగా నగరానికి విచ్చేసిన ఆయన సోమవారం ఉదయం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి శ్రీ వైష్ణవీ ప్రసాద్ (పెండ్యాల శేష సాయి వరప్రసాద్) ఎన్నికల మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోను తొలిసారి ఆవిష్కరిస్తున్నానన్నారు. శ్రీ వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, జంటనగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షులు తలసీ శ్రీనివాస్, వరణాశి వంశీ, నాయకులు ద్రోణంరాజు రవికుమార్, వక్కలంక శ్రీనివాసరావు, మునిపల్లె శ్రీనివాస్, అరుణ రాజేశ్వరి, రత్న వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, మీర్‌పేట ప్రాంతాల బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నూతన రథానికి పూజలు చేస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

హనుమాన్ దేవస్థానానికి రథం బహూకరణ

చంపాపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయానికి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుమిత దంపతులు రూ.10 లక్షల విలువైన రథాన్ని తయారు చేయించారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా రథానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

దేవస్థానాన్ని సందర్శించిన స్వరూపానందేంద్ర

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానాన్ని సోమవారం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సందర్శించారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, ఆలయ పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ కోకాపేటలో రాజశ్యామల అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు మధుసూధన్‌రెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్ గౌడ్, మధుసాగర్, ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

రంగారెడ్డి కోర్టులు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి పోక్సో కోర్టు న్యాయమూర్తి జీవితఖైదు, రూ. 25 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పుచెప్పారు. పీపీ బర్ల సునీత కథనం ప్రకారం.. మీర్‌పేటకు చెందిన మణికంఠ అదే ప్రాంతానికి చెందిన బాలికతో పరిచయం పెంచుకుని మాయమాటలతో లోబర్చుకున్నాడు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలి తల్లి 2017 మార్చి 21న మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి పద్మావతి నిందితుడికి శిక్ష విధించారు.

భార్య మరణానికి కారకుడైన భర్తకు జైలుశిక్ష

రంగారెడ్డి కోర్టులు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భార్యను మానసికంగా వేధించి ఆమె మరణానికి కారకుడైన భర్తకు ఐదేళ్ల కారాగార శిక్ష, రూ. 4 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఐదో ఏడీజే న్యాయమూర్తి మాధవి కృష్ణ తీర్పు చెప్పారు. పీపీ వినత కథనం ప్రకారం... పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న కరీమున్నీసా తన కూతురు ఫరీద్ ఉన్నీసా వివాహం అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ బిన్ సాలేహాతో జరిపించారు. భర్త, అత్త వేధింపులు భరించలేక ఫరీద్ ఉన్నీసా ఆత్మహత్యకు పాల్పడింది. కరీమున్నీసా ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పహాడీషరీఫ్ పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవికృష్ణ నిందితుడికి శిక్ష విధించారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ

ఓల్డ్ మలక్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను ముందుగా చెల్లించే వారికి ఎర్లీబర్డ్ స్కీం కింద 5 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈనెల 30లోగా చెల్లించే వారికే రాయితీ వర్తిస్తుంది. గత సంవత్సరం మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో 13 కోట్ల రూపాయలు ఎర్లీబర్డ్ స్కీం కింద వసూలయ్యాయి. ఈ సంవత్సరం సుమారు 15 కోట్ల రూపాయలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు మలక్‌పేట సర్కిల్‌లో ఎర్లీబర్డ్ స్కీం కింద 4 కోట్ల 33 లక్షల రూపాయలు వచ్చాయి. మునిసిపల్ కార్యాలయంలో, ఆన్‌లైన్ ద్వారా కూడా పన్ను చెల్లించవచ్చు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్ కోరారు.

'నాగార్జున'లో ఘనంగా స్నాతకోత్సవం

సరూర్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్‌లో సోమవారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నల్ల గౌన్లు ధరించగా, నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ జి.విఠల్‌రెడ్డి వారికి పట్టాలు ప్రదానం చేసి అభినందించారు. అనంతరం చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మహేశ్, ఇన్‌ఛార్జిలు దుర్గ, సంధ్య ప్రశాంతి, రాధిక, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న శివగంగకాలనీ నూతన కార్యవర్గం

శివగంగకాలనీ నూతన కార్యవర్గం

కొత్తపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ శివగంగ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొండూరు లక్ష్మీపతిగౌడ్, ఉపాధ్యక్షులుగా జీ.నర్సింగరావు, పీ.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా అప్పల్ల సుబ్బారావు, కోశాధికారిగా ఎం.వెంకటరాముడు, సంయుక్త కార్యదర్శులుగా జే.నరేందర్, ఈపీ.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జీ.వృషభనాథం, అనిల్‌సాగర్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా వీ.రత్నకుమార్, భిక్షపతిరావు, వీరస్వామి, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, వెంకటయ్య, మల్లేష్ గౌడ్ వ్యవహరిస్తారని అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాడ్జిలో పేకాట ఆడిస్తున్న నిర్వాహకుడు సహా 11 మంది పేకాటరాయుళ్లను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి 37,290 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కామినేని చౌరస్తాలోని మారుతీ రెసిడెన్సీ రూమ్ నెం. 405లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాడి చేసి పీ అండ్ టీ కాలనీకి చెందిన నిర్వాహకుడు, ఎలక్ట్రీషియన్ గుడిపల్లి రాకేష్ (25), 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు.



ఎంఈఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు

ఎంఈఎఫ్ జిల్లా కమిటీ నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రంగారెడ్డి జిల్లా కమిటీని సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ ప్రకటించారు. అధ్యక్షుడిగా శ్రీపతి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆడెపు జానయ్య, ప్రధానకార్యదర్శిగా కాటపాక సుఖేందర్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణగోపాల్, ఉపాధ్యక్షులుగా గ్యార ధన్‌రాజ్, కొండూరు మల్లేష్, కోశాధికారిగా నరేందర్, జాయింట్ సెక్రటరీగా చెరుకూరి రమేష్, కార్యవర్గ సభ్యులుగా దుర్గయ్య, రత్నం రవి, పొగాకు భానయ్య, వస్కుల లింగయ్య, రవీందర్, ముఖ్య సలహాదారుడిగా యల్లయ్య, గిరి నియమితులయ్యారు.

ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత
చీకట్లోనే పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో చీకట్లోనే పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే పరీక్షలు రాస్తున్నారు. పాఠశాలకు కరెంట్ నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంఈవోకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది.